కథ




# సంధ్యారాగం

వారణాసి నాగలక్ష్మి

**'విహంగమా! నీ వెంట విహరింప మనసాయె!**
**క్రూర లోకపు రొదకు దూరమైపోదామా?'**

అప్రయత్నంగా సమీర్ గొంతులోంచి పాట వెలువడింది. యూనివర్సిటీలో శుభాకిరణ్ పాడుతుంటే స్నేహితులంతా చెట్లకింద రాళ్లమీద కూర్చుని వింటూ, అలా విహరించాలని తహతహలాడేవారు! దాదాపు అలాంటి విహారమే ఇది! ఎదురుగా వినీల విశాలాకాశం! దూది పింజెల్లా కదిలిపోతున్న మబ్బులు... అంతే ఇంకేమీ లేదు. సావేరి తప్ప! పశ్చిమాకాశంలో సూర్యుడు తన వెనక ఉన్నాడు. కిందనుంచి ఏటవాలుగా పడుతున్న ఆ బంగారు కిరణాల గోరువెచ్చని కాంతి సావేరి శరీరానికీ, వదనానికీ వింత మెరుగులు దిద్దుతోంది. పాట నచ్చింది కాబోలు... విశ్రాంతిగా నవ్వుతూ 'ఊ' దీర్ఘం తీసి, ''బావుంది... పూర్తిగా పాడు సమీర్!'' అంది సావేరి.

''గాలి కెరటాలలో తేలుతూ పయనించి
మబ్బు కన్నెల గానమధురిమను విందామా?
మాయ మర్మము మరచి మాటాడుకుందామా?''

గొంతు విప్పి హాయిగా పాడాడు సమీర్, ఆ ప్రశ్న సావేరినే అడుగుతున్నట్టుగా. మంచి పాటల్ని కళ్ళు మూసుకుని వినే అలవాటున్న సావేరి, కనురెప్ప వేస్తే అద్భుతం జారిపోతుందేమో అన్నట్టు కళ్ళతో ఆకాశపు అందాన్నీ, శరీరపు అణువణువునా గాలిలో ప్రయాణిస్తున్న అనుభవాన్నీ నింపుకుంటూ, తన్మయురాలై ఉండిపోయింది. గాలి కెరటాలలో తేలుతూ పయనించడం అంటే ఇదే. ఈ పాట ఇదివరకు కూడా పాడాడు సమీర్. కాని, ఇప్పటి అనుభూతి ఇంతకుముందు కలగలేదు!

పాడుతున్న సమీర్ దృష్టిపథంలో చిరునవ్వుతో ప్రకాశిస్తున్న సావేరీ, ఆమె వెనక చిక్కని నీలాకాశం, మెరుస్తున్న వెండిమబ్బులూ... పాట పూర్తిచేస్తూనే మెడలో వేలాడుతున్న డిజిటల్ కెమెరా తీసి సావేరి ఫోటో తీశాడు. వెనకపక్కనున్న అమెరికన్ కుటుంబం చప్పట్లు కొడుతూ కలగాపులగంగా హర్షం వెలిబుచ్చారు. పక్కకు తిరిగి 'థాంక్యూ' చెప్పాడు నవ్వుతూ.

దూరంగా ఎగురుతున్న పక్షుల గుంపుని చూపిస్తూ ''కొంచెం అలాగే ఉన్నాం కదా తొమ్మిది పక్షుల్లాగా మనం?'' అడిగింది సావేరి. తలూపి కిందకి చూశాడు సమీర్. గాలి సముద్రంలో ఓడ ప్రయాణంలాగా 'హాట్ ఎయిర్ బెలూనింగ్' ఇంత ఆహ్లాదకరంగా ఉంటుందనుకోలేదు! పైనున్న రంగురంగుల పెద్ద బెలూన్‌లోకి వేడిగాలిని బ్లో చేస్తున్నప్పుడు తప్ప ఆహ్లాదకరమైన నిశ్శబ్దం. వేరువేరు గాలిపొరలలో గాలి దిక్కుని సూచించే పరికరం, అవసరమైనప్పుడు నేలమీదున్న తమ టీమ్‌తో మాట్లాడేం

దుకొక వాకీటాకీ... ఈ రెండిటి సహాయంతో ఎంతో నేర్పుగా ఆ బెలూన్‌నీ, దానికి వేలాడుతున్న వెదురు మబ్బునీ, బుట్టలో ఉన్న తొమ్మిదిమందినీ ఆకాశయానం చేయిస్తున్నాడు పైలట్ టిమో.

కింద దూరంగా నురగలతో పరుగులు పెడుతున్న పసిఫిక్ మహాసముద్రం. దాని ఒడ్డున అందాల శాండియాగో నగరం! తమ గమ్యాన్ని చేర్చే దిక్కువైపు పోవడం కోసం వివిధ గాలిపొరల్లోకి ఎక్కుతూ దిగుతూ... విద్యుత్ స్తంభాలూ, తీగలూ కొంచెం దగ్గరైనప్పుడల్లా మరింత పైపొరల్లోకి వెళుతూ, ఇల్లూ, పొలాలూ, పార్కులూ, దూసుకుపోయే వాహనాలతో మిలమిలలాడుతున్న రహదారులూ దాటుతూ... సరిగ్గా పక్షి యానంలాగే తమ ప్రయాణం!

సావేరి చేతిని స్నేహపూర్వకంగా ఊపుతూ ''థాంక్యూ! నా పుట్టినరోజు బహుమతిగా ఇలాంటి అద్భుతానుభవాన్ని ఇచ్చినందుకు. ఇలా పక్షిలా ఎగరాలని చిన్నప్పటినుంచి ఎంతో కోరిక!'' అన్నాడు సమీర్.

''నీకేనేమిటి? ఎగిరే పక్షిని చూసి, భూమ్మీద పుట్టిన ప్రతివాడూ ఎప్పుడో ఒకప్పుడు అలా అనుకునే ఉంటాడు'' నవ్వుతూ భుజాలెగరేసింది సావేరి.

''అయినా, వందేసి డాలర్లు దండగపెట్టానని గొణిగావుగా ముందు?'' ఇప్పుడేమంటావు అన్నట్టు చూసింది.

నవ్వాడు సమీర్.

''అవును తల్లీ... వీళ్ళ మాటలు వింటే కోరి కొరివితో తల గోక్కుంటున్నట్టే ఫీలయ్యా! ఏదైనా అనుకోనిది జరిగి చావుదెబ్బలు తిన్నా, ఏ నష్టం జరిగినా మనదే బాధ్యత అని సంతకం చేయించుకున్నారుగా ముందే! స్టీరింగ్ ఎలా చేస్తావయ్యా అంటే స్టీరింగ్ లేదన్నాడు! ఎక్కడ దిగుతాం అంటే ఏమో తెలీదన్నాడు. పక్కనేమో అంతులేని సముద్రం... ఆ బెలూన్ కాస్తా ఎగురుతూ పోయి సముద్రంలో పడిందంటే చచ్చూరుకుంటాం అనుకున్నా'' తల గోక్కున్నాడు సమీర్.

నవ్వి, ''సాయంత్రం వేళ సముద్రం మీంచి నేలవైపే వీస్తుంది గాలి. అందుకే ఈ టైంలో వేస్తారు ఈ ట్రిప్. అయినా సస్పెన్స్, థ్రిల్ అలా నిలపడానికి సగం నిజాలు చెప్తారు వీళ్ళు'' అంది బుట్ట బయటికి చేతులు చాచి, తల వెనక్కి వాల్చి, గగన విహారాన్ని తనివితీరా అనుభవిస్తూ.

లేత నీలిరంగు టీ షర్టు, ముదురు నీలం రంగు జీన్స్ పాంట్‌లో, ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతున్న కళ్ళతో, ఆరోగ్యంగా మెరుస్తున్న సావేరిని మెచ్చుకోలుగా చూస్తూ ''టాహోలో స్కీయింగ్ చేశావుట! నచ్చిందా?'' అడిగాడు.

''ట్రై చేశా. బాగా రాలేదుగాని, రోప్‌వేలో పైకెక్కి మంచు పర్వతాల మీద కిందికి జారడం భలే బావుంది. నీలా రోలర్ బ్లేడింగ్ వచ్చినవాళ్ళకి ఇంకా తేలిక!''

''ఇంకా ఏం చేశావు ఇక్కడికొచ్చాక?''

''శాన్‌ఫ్రాన్సిస్కో బాక్ వాటర్స్‌లో వాటర్ స్కూటర్ నడిపా. బ్యాలన్స్ తప్పి చల్లటి నీటిలో పడి చచ్చేంత జలుబు చేసింది. ఇప్పుడు బాగా చేయగలననుకో''

''ఇంకా?''

''కనూయింగ్‌కి వెళ్ళాను ఇంకో ఇద్దరితో. ఎత్తుపల్లాల్లో చెట్ల కొమ్మల మధ్యనుంచి ఉధృతంగా ప్రవహించే నదిలో కేవలం తెడ్ల సాయంతో చిన్నపడవలో ప్రయాణం. మధ్యలో ఒకచోట హఠాత్తుగా నది చీలిపోయి, ఒక భాగం జలపాతంలాగా విడిపోయింది! ఆ నీళ్ళతోపాటు మా పడవ కూడా పడిపోతుందేమో అని శక్తికొద్దీ ముగ్గురం చేతులు నెప్పెట్టేలా తెడ్లు వేశాం. భలే థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్!''

''బంగీ జంపింగ్? పారా సైలింగ్?''

''లేదింకా... ఎపుడో చేస్తానేమో''.

''సావేరీ! ఇండియాలో పుట్టి పెరిగిన అమ్మాయిల్లో ఇలాంటి స్పిరిట్ చాలా తక్కువగా చూశాను. ఎందుకలా?''

నవ్వుతూ అతని మొహంలోకి చూసింది సావేరి.

''బహుశః పెంపకంలో తేడా అయుండచ్చు. పరుగెత్తడానికీ, రాళ్ళూ గుట్టలూ ఎక్కడానికీ, కిందికి దూకడానికీ చాలా ఇబ్బందిగా ఉండే బట్టలు వేసుకుంటూ పెరుగుతాం అక్కడ. నీళ్ళలో తడిస్తే సంకోచం. కిందపడితే పడిన పోశ్చర్ గురించీ, ఎక్కడ దుస్తులు చిరిగాయో అని ఒక్కక్షణంలో వంద భయాలు. మనసారా నవ్వడం, నచ్చనిది నచ్చలేదని గట్టిగా చెప్పడం కూడా తప్పన్నట్టే పెంచుతారు మనవాళ్ళు! స్వేచ్ఛగా ఆడుకోవడానిక్కూడా పరిమితులుండే సమాజంలో ఎడ్వెంచర్స్ పట్ల కోరిక ఎలా ఉంటుంది? కానీ... ఇప్పుడిప్పుడే చాలా మార్పులొచ్చాయిలే'' అని చివరి మాటలు, పెద్దశబ్దంతో పైలట్ మంట పెద్దది చేయడంతో అస్పష్టంగా వినిపించాయి. మంటకి వేడెక్కిన గాలి, బెలూన్‌ని అలవోకగా గాలి పైపొరల్లోకి తీసుకెళ్ళింది.

''నిజానికి ఇప్పుడు అమ్మాయిలే అబ్బాయిలకన్నా ఫాస్ట్‌గా ఉన్నారు ఇండియాలో. ఇంటి పనుల్లో ఏమోగాని, బయటికెళ్ళి అన్ని పనులూ అబ్బాయిలకన్నా బాగా చేస్తున్నారు.''

''అవును. ఆడపిల్లలైనా మగపిల్లలైనా ఒకలాగే పెంచుతున్నారు ఇప్పటి పేరెంట్స్. అందరూ కాదు గానీ పట్టణాల్లో తల్లిదండ్రులు..'' సాలోచనగా అంది సావేరి. అడవిలో సహజంగా విచ్చిన పువ్వులా ఏ విషయంలోనైనా భేషజం లేని ఆమె వ్యక్తిత్వం, ధైర్యం, ఆత్మవిశ్వాసం మూర్తీభవించినట్టుండే ఆమె ప్రవర్తనా, ఆఫీసులో ఆమె చేరినప్పటి నుంచి తనను ఆకట్టుకున్నాయి. కొంతమంది ఇండియన్ అమ్మాయిలు కొంచెం దురుసుగా అనిపించే భాష వాడడం, ఒక్కసారిగా పొందిన స్వేచ్ఛని అదుపులో పెట్టడం చేతకానట్టు అతిగా ప్రవర్తించడం చూశాక సావేరి విభిన్నంగా కనిపించింది తనకి. ఎంతో ఆధునికంగా కనిపించే అమ్మాయిలక్కూడా లేని ధైర్యం, సాహసం సావేరిలో కనిపించి తనకెంతో ఆశ్చర్యం కలిగింది.

''నిన్నిలా పెంచిన మీవాళ్ళని నిజంగా కంగ్రాచ్యులేట్ చెయ్యాలి'' అభినందనగా అన్నాడు.

''నా పేరెంట్స్‌నా?'' నవ్వింది సావేరి. ''ఇలా వెళ్ళానని తెలిస్తే లబలబలాడతారు మా అమ్మానాన్న''.


''ఓ... మరి?''


'మరి?' కిందికి చూసింది సావేరి. ఫ్రీవే మీద కొంప మునిగిపోతున్నట్టు పరుగెడుతున్న వాహనాలు! పెద్దపక్షిలా తమతోపాటు సాగిపోతున్న బెలూన్... మనసు ఆరేళ్ళు వెనక్కు పోయింది!

***

''ఊ... సిగ్గులేదూ వెధవపని చెయ్యడానికి?'' మంచం మీద బోర్లా పడుకుని ఏడుస్తున్న సావేరిని తీవ్రంగా ప్రశ్నించింది సుమేధ. ఆమెని వారిస్తూ ''ఏయ్.. ఏమిటే అలా మాట్లాడతావ్? అదసలే డిప్రెషన్‌లో ఉంటే?'' కోపంగా అంది మాలిని. ఇంకా దడదడలాడుతూనే ఉన్న గుండెతో గది తలుపుకున్న బోల్ట్ మరోసారి చెక్‌చేసి, సావేరి పక్కన కూర్చుని, తలమీద రాస్తూ –

''ఎందుకే అలా చేశావ్? మేమేమైపోవాలి?






హాస్టలంతా ఎంత గొడవైపోయేది? మీ అమ్మా వాళ్ళకి ఏం చెప్పాలి?'' గొంతులో వణుకు అదుపు చేసుకుంటూ అడిగింది మాలిని.

కొంతసేపటికి సావేరి ఏడుపాపి, నిస్త్రాణగా పడుకుంది.

మాలిని లేచి, కుర్చీ ఎక్కి, ఫ్యాన్‌కి వేసిన చున్నీ ముడి విప్పబోయింది.

''మున్నీ! ఆ చున్నీ ముట్టుకున్నావంటే తంతాను. అదలాగే ఉంచు ఎగ్జిబిషన్‌కి. అందర్నీ రానీ. చూడనీ మన 'చావేరి' చెయ్యబోయిన వెధవ పని!'' అసహ్యించుకుంటూ అంది సుమేధ.

''ఎందుకే అంత ఘోరంగా మాట్లాడతావు? జీవితం కొనసాగించడమే వేస్ట్ అనిపించినప్పుడు....''

''ఆс... అనిపించినప్పుడు? ఇలాగా చచ్చేది? ఎవరికేనా కిడ్నీలు దానం చెయ్యమను. అంత దాన గుణం లేకపోతే ఏదో సాహసం చెయ్యమను. మోపెడ్ నడపడానిక్కూడా భయపడి చస్తుంది. ఎవడో చచ్చువెధవ చేసిన పనికి ప్రాణం తీసుకుందుకు రడీ అయిపోయింది! దానికి మాత్రం ధైర్యం! లాబ్‌లో టెస్ట్‌ట్యూబ్‌లో ఏసిడ్ పొయ్యాలంటే వొణుకు. పరీక్షకెళ్తే మొదటి నాలుగు లైన్లూ వొణికిపోతూ ఒంకరటింకరగా రాస్తుంది! చావడానికి మాత్రం ఎంత ధైర్యమో!''

''మేధా! ఎంత క్రూరంగా మాట్లాడతావే. దానికి బతకడానికి ధైర్యం లేక చద్దామనుకుందే. ధైర్యం ఎక్కువై కాదే. దానికిపుడు కావల్సింది నీ ఎత్తిపొడుపు మాటలు కాదే.. శూలాలతో పొడిచినట్టు మాట్లాడుతున్నావు.''

''ఆహాс! ఎంత జాలి గుండె? ముందు దాన్ని లేపి కూర్చోపెట్టు... లేకపోతే ఇప్పుడే వెళ్ళి పోలీస్ రిపోర్టిచ్చి వస్తా - 'ఎటెంప్టెడ్ సూయిసైడ్' అని.''

పడుకున్న సావేరి తుళ్ళిపడింది. ''మేధా! ఎంత నిర్దయగా ఉంటావే...'' దుఃఖంతో గొంతు పూడుకుపోయింది. కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. ఆవేశంగా లేచి ఫాన్‌కున్న చున్నీ గబగబా విప్పబోయింది.

''ఉండనీ... మేం పడుకున్నాక మళ్ళీ ప్రయత్నించి అనుకున్న పని పూర్తి చెయ్యచ్చు'' హేళనగా అంది సుమేధ.

మాలిని గొంతు పెంచి ''బుద్ధి లేదుటే. అదే పదే పదే అంటావు? అదసలే కుమిలిపోతుంటే'' అరిచింది కోపంగా.

''అది చేసిన పనికి దాన్ని పోలీసులకప్పగించకుండా నా మీద అరుస్తావేమే? అది కుమిలిపోతోందా? ఎందుకూ? ఓ పనికిమాలిన జుట్టుపోలిగాడు అది లైబ్రరీ నుంచి హాస్టలుకొస్తుంటే తుప్పల వెనక్కి లాక్కెళ్ళాడా? అరవడానిక్కూడా దానికి గొంతు పెగల్లేదా? సరే... నోరు మూసుకునుండక ఇప్పుడీపనెందుకు?''

''సర్వం పోయాక ఎలాగే బతికేది?'' ఏడుస్తూ అంది సావేరి చున్నీ చుట్టచుట్టి పెట్టెలో కుక్కేస్తూ.

''ఆс? సర్వం పోయిందా? నీ రెండు చేతులూ, కాళ్ళూ, కళ్ళూ అన్నీ ఉన్నాయే? నీ పుస్తకాలూ, బట్టలూ, సర్టిఫికెట్లూ, పర్సులో డబ్బులూ అన్నీ ఉన్నాయే?''

''ఎందుకే ఇలా చంపుకు తింటావు?'' పెట్టెమీదికి వాలిపోయి వెక్కిళ్ళు పెడుతూ అంది సావేరి.

''నేను నిన్ను చంపుకు తింటున్నానా? రెండు నిముషాలు లేటుగా లేచి ఉంటే ఈపాటికి నీ కళ్ళు వెళ్ళుకొచ్చి, ఆ ఫానుకు వేళ్ళాడుతూ ఉండేదానివి! ఆ తర్వాత బతకలేక చావాల్సింది మేము. ఆ తర్వాత ఈ రూములో ఎలా ఉంటామో, ఈ హాస్టల్లో ఉంటూ నీ ఆలోచనల్తో చస్తూ బతుకుతూ ఎలా ఉండేవాళ్ళమో ఆలోచించావా? పోలీసులొచ్చి మమ్మల్ని వాళ్ళ ప్రశ్నల్తో చంపుకు తింటే ఏమయ్యేవాళ్ళమో నీకు తోచిందిటే? మీ అమ్మా వాళ్ళు చూస్తే వాళ్ళ గుండె పగిలిపోతుందేమో ఆలోచించావుటే? ఎవడో చేసిన వెధవ పనికి మమ్మల్నందర్నీ శిక్షించాలనుకున్నావు కదే! వెధవ పని చేసింది వాడైతే వాడు చావాలిగానీ నువ్వెందుకే?''

''దేవుడా! ఇది నన్ను చావనివ్వదు బతకనివ్వదూ'' రెండు చేతుల్తో చెవులు మూసుకుని, హృదయ విదారకంగా అరిచింది సావేరి.

సుమేధ చటుక్కున వెళ్ళి, సావేరి రెండు చేతులూ తన చేతుల్తో పట్టుకుని ''పిచ్చిమొహమా! నావైపు చూడు... నాకింద ధైర్యం ఎలా వచ్చింది? చిన్నప్పుడు నీకన్నా పిరికిదాన్ని! పెళ్ళి చేసుకున్న అమెరికా మొగుడు మోసం చేశాడని తెలిశాక అవమానంతో దుఃఖంతో చావాలని నాకూ అనిపించింది. చావాలనుకున్నప్పుడు నాకు పిచ్చి ధైర్యం వచ్చింది. చచ్చేబదులు ప్రపంచాన్ని ధిక్కరించి బతికి చూద్దామనుకున్నా! నిజం! అపుడే డ్రైవింగ్ నేర్చుకున్నా. స్విమ్మింగ్ నేర్చుకున్నా. నాకన్నా అయిదేళ్ళు చిన్నవాళ్ళైన మీతో కలిసి ఎమ్మెస్సీ చదవాలని మళ్ళీ ఎంట్రెన్స్ రాసి, సీటు తెచ్చుకుని ఇక్కడ చేరా. ఏ పనిలోనైనా ప్రాణానికి ప్రమాదం ఉందంటే భయం కలుగుతుంది. ప్రాణమే వదిలేయడానికి సిద్ధపడ్డప్పుడు భయాన్ని వదిలెయ్యలేమా? అంతగా ఏదైనా ప్రమాదం కలిగి ప్రాణం పోతే అలా ప్రాణం వదలడం నయం కాదుటే? బలవంతంగా చచ్చి 'పిరికిది... అపవాదు భరించలేక చచ్చింది' అనుకునే బదులు? అయినా ఎవరి తప్పుకో మనని మనమే ఎందుకు శిక్షించుకోవాలే? తలెత్తుకుని హాయిగా బతకవే... నిన్ను చూసి ఎవరైనా నవ్వితే వాళ్ళని చూసి నువ్వు నవ్వవే. నిన్ను నువ్వు గౌరవించుకుంటే ప్రపంచం చచ్చినట్టు గౌరవిస్తుందే! చచ్చినట్టు! మొన్న సెలవుల్లో మా క్లబ్‌లో పూల్‌లో ఈత నేర్చుకోవే అంటే భయపడిపోయావు. ఈదలేక మునిగి చచ్చిపోతావేమో అని భయం! ఈసారి ఈత నేర్చుకో. మునిగిపోయావనుకో ఇంతకన్నా గౌరవంగా చావచ్చు. ఈత వచ్చేసిందనుకో... అదీ బానే వుంటుందిగా! స్కూటీ నేర్చుకో... దేనికైనా కొట్టేస్తావని భయం కదా. అలా చస్తే కాస్తన్నా నయం కదా. దేనికీ కొట్టకుండా మానేజ్ చేశావనుకో మరీ హాయి డ్రైవింగ్ వచ్చేస్తుంది. భయం వదిలేసి ధైర్యంగా ఉండవే... బతికినా, చచ్చినా కూడా గొప్పగానే ఉంటుంది!''

ఏడుపులోనే నవ్వొచ్చింది సావేరికి.

మాలిని సుమేధ వైపే విభ్రాంతిగా చూస్తూ కూర్చుంది. సుమేధ సావేరి పెట్టె తెరిచి, చుట్టచుట్టిన చున్నీ తీసి, నీటుగా మడతపెట్టి లోపల పెట్టింది.

''నీకు కంప్లయింట్ చెయ్యడం ఇష్టంలేకపోతే ఆ తుప్పల్లో ఏం జరిగిందో మర్చిపో. ఆ విషయం మన ముగ్గురి మధ్యే సమాధి చేసేద్దాం. ఆ జుట్టుపోలుగాడి సంగతి ఇంకోలా తేలుద్దాం. వాడు డిబార్ అయ్యేలా చెయ్యడం పెద్ద కష్టంకాదు. అది తర్వాత చూద్దాం. రేపొకసారి గైనకాలజిస్ట్ దగ్గరికెళ్దాం... సరేనా?'' ధైర్యాన్ని నూరిపోస్తూ సావేరి జుట్టు నిమిరింది సుమేధ. మాలిని తెచ్చిన మంచినీళ్ళు తాగించి, ఆమె కళ్ళలోకి చూస్తూ ''సావీ! గుర్తుపెట్టుకో. చావడానికిక్కూడా సిద్ధమైనదానివి ఇంక చిన్నచిన్నవాటికి భయపడ్డానికి వీల్లేదు. ముందు జీవితంలో ఎప్పుడైనా చావెదురైతే చచ్చిపో గాని భయాన్ని మాత్రం వదిలెయ్! ధైర్యంగా బతుకు. నీకేం జరగలేదు! నువ్వే తప్పూ చెయ్యలేదు. అర్థ